# తాగునీటికి తప్పిన తండ్లాట

- మిషన్ భగీరథతో హుజూరాబాద్‌లో ఇంటింటికీ సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణప్రజలు

హుజూరాబాద్, అక్టోబర్ 24: ఒకప్పుడు నీటి ఎద్దడితో పట్టణంలోని సగం కాలనీల వాసులు అరిగోస పడేటోళ్లు. ప్రధానంగా విద్యానగర్, కాకతీయ కాలనీ, గాంధీనగర్, పాత ఎక్స్ఛేంజ్ తదితర ప్రాంతాల్లో విపరీతమైన నీటి సమస్య ఉండేది. దీనికి తోడు దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్ నిత్యం ఏదో ఓ చోట పగిలి నీరు వృథాకావడం.. అవసరాలకు సరిపడా నీళ్లు రాక పట్టణ ప్రజలు ఇక్కట్లు పడడం పరిపాటిగా మారేది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ.50 కోట్ల నిధులు వెచ్చించి ఇంటింటికీ తాగునీరందిస్తుండడంతో పట్టణ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతున్నది.



హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో షాదీఖాన వద్ద 10లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

## పక్కా ప్రణాళికతో పరిష్కారం

పట్టణానికి నిత్యం నీటి సరఫరా చేసేందుకు బోర్నపల్లి గుట్టపై బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పెద్ద ట్యాంక్)ను నిర్మించారు. ఇందులో 5లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే అవకాశముంది. ఈ ట్యాంక్ నుంచి పట్టణంలో నిర్మించిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేస్తారు. వాటి నుంచి తిరిగి పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ నీరందిస్తున్నారు. మిషన్ భగీరథ పనులు చేపట్టినప్పుడు పట్టణ జనాభా దాదాపు 35వేలు ఉంది. ప్రస్తుతం 40వేల జనాభా వరకు ఉండగా, భవిష్యత్‌లో 85వేల వరకు చేరినా కూడా నీటి అవసరాలు తీర్చేలా పైపులైన్లు వేశారు.

## పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి



మిషన్ భగీరథ నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. జనవరిలోనే నీళ్ల సమస్య వచ్చేది. బిందెలు పట్టుకొని బోరింగ్‌ల దగ్గరికి వెళ్లేవాళ్లం. అప్పుడు చాలీచాలని నీళ్లతో ఇబ్బందులు పడ్డాం. మిషన్ భగీరథ నీళ్లు రాకముందు నీళ్ల కోసం సమయం గడిచిపోయేది. ఇప్పుడు నీళ్లకు కొదవలేకపోవడంతో ఇంటి పనులు ఇట్టే అవుతుండడంతో ఇతరాత్ర పనులు కూడా చేసుకుంటున్నం.

*-తవటం సుభద్ర రాధ, మామిడ్లవాడ*

## ఒక్కొక్కరికీ వంద లీటర్ల నీళ్లు



మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తప్పాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పైపులైన్లు నిర్మించారు. ప్రస్తుతం మిషన్ భగీరథలో వేసిన పైపులైన్ల వ్యవస్థ రాబోయే 50ఏళ్ల వరకు సరిపోతుంది. పట్టణంలో ప్రతి ఒక్కరికీ 100లీటర్లకు పైగా నీళ్లు సరఫరా చేస్తున్నాం. ఒకవేళ నీళ్లు అవసరం లేకపోతే నల్లాను బందు చేయండి. నీటిని పొదుపుగా వాడుకోవాలి.

*- కళ్లెపల్లి రమాదేవి, కౌన్సిలర్*

## ఆ రోజులు మళ్లీ రావద్దు



ఒకప్పుటి నీటి గోస రోజులు మళ్లీ రావద్దు. తెల్లారిందంటే నీళ్ల ట్యాంకర్ల కోసం ఎదురు చూసేటోళ్లం. అవికూడా సరిపోయేవి కావు. అరకొర నీళ్లతో గడ్డు రోజులు గడిపినం. ఇప్పుడు నీళ్లకు కొదువలేదు. మిషన్‌భగీరథతో నీళ్ల కోసం ఎదురుచూసే అవసరం తప్పింది. తాగునీటి సమస్య తీర్చిన కేసీఆర్ రుణం ఈ ఎన్నికల్లో తీర్చుకుంటాం.

*- జీ సరోజన, విద్యానగర్*



హుజూరాబాద్‌టౌన్: హైస్కూల్ క్రీడామైదానంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ పాలకవర్గం, తదితరులు



జమ్మికుంట: పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న సీఐ బర్పాటి రమేశ్

# ఘనంగా దసరా వేడుకలు

హుజూరాబాద్‌టౌన్/ జమ్మికుంట/ సైదాపూర్/ వీణవంక, అక్టోబర్ 24: నియోజకవర్గ వ్యాప్తంగా విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. హుజూరాబాద్ శివరామాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానానికి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించగా, బల్దియా పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. హైస్కూల్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన రావణాసుర వధ కార్యక్రమాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్‌చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, పాలకవర్గ సభ్యులతో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో టౌన్ సీఐ బర్పాటి రమేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీధర్, రాజేశ్, సిబ్బంది ఆయుధ పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, ఎంపీపీ దొడ్డె మమత-ప్రసాద్, జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, తదితర గ్రామాల్లో రావణదహనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. అలాగే సైదాపూర్ మండలకేంద్రంతో పాటు వీణవంక తదితర గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## ఇల్లందకుంట దేవాలయంలో..

ఇల్లందకుంట, అక్టోబర్ 24: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పాత దేవాలయంలో దసరా పండుగ సందర్భంగా ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. జమ్మి చెట్టువద్ద పూజల అనంతరం ఉత్సవమూర్తులను ఆశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలతాసురేందర్‌రెడ్డి, ఆలయ ఈవో సుధాకర్, ఎంపీటీసీ విజయకుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ రాంస్వరణ్‌రెడ్డి, అర్చకులు శేషం వంశీధరాచార్యులు, రామాచార్యులు, కన్నయ్య, లోకాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



వీణవంకలో దుర్గామాత అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



ఇల్లందకుంటలో శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను మాడవీధులో ఊరేగిస్తున్న భక్తులు

# అవకాశమివ్వండి.. మరింత అభివృద్ధి చేస్తా

- వీణవంకను పట్టణంలా మారుస్తా
- గులాబీ జెండా ఎగురవేసి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్తాం
- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- వీణవంకలో విజయదశమి ఉత్సవాలకు హాజరు

వీణవంక, అక్టోబర్ 24: ఎమ్మెల్సీగా, మండలి విప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి హుజూరాబాద్ నియోజకవర్గాన్ని, వీణవంక మండల కేంద్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, ఒక్కసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన దసరా వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల ఇప్పటి వరకు వీణవంకను ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిధులు తీసుకువచ్చి అద్దాల్లా మెరిసే సీసీరోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ కార్యాలయాల ఆధునీకరణ వంటి ఎన్నో పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండల కేంద్రాన్ని పట్టణంలా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా ఉండి గులాబీ జెండా ఎగరవేడానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నీల కుమారస్వామి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, ఉపసర్పంచ్ వోరెం భానుచందర్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్, వార్డు సభ్యులు, ఆయా గ్రామాల్లో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

***బేకరీని ప్రారంభించిన మండలి విప్***

వీణవంక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్‌పీ బేకరీని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ ఆర్థికంగా ఎదగాలని బేకరీ నిర్వాహకులు పోతుల సురేశ్, నీల పున్నంచందర్‌కు సూచించారు.


***ఆర్థిక సాయం అందజేత***

వీణవంక మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలకు మండలి విప్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, నాయకులు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

# 'కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేయాలి'

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 24: కేంద్రం శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. విశ్వరూప రథయాత్రలో భాగంగా సోమవారం హుజూరాబాద్‌కు వచ్చిన ఆయన, ముందుగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో కృష్ణమాదిగ మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ, దానిని నెరవేర్చడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదని విమర్శించారు. నవంబర్ 7న హైదరాబాద్‌లో లక్షల మంది మాదిగలతో నిర్వహించనున్న విశ్వరూప మహాసభలో మాదిగల సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు రుద్రారపు రామచంద్రం, బచ్చల కూర వెంకటేశ్వర్లు, ఇంజం వెంకటస్వామి, వేల్పుల రత్నం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, రేణిగుంట్ల సాగర్, మారేపల్లి శ్రీనివాస్, తునికి వసంత్, దేవునూరి రవీందర్, తూర్పాటి రాజు, తూర్పాటి మోహన్, బోరగాల రాజయ్య, పొడిశెట్టి వెంకటరాజం, ఇల్లందుల సమ్మయ్య, బోరగాల మొగిలి, బోరగాల రాజయ్య, మోరే సతీశ్, వేల్పుల ప్రభాకర్, ఆడపు సురేందర్, రొంటాల సుమన్, ఎర్ర రవీందర్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిగురుమామిడి, అక్టోబర్ 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001 -02 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. అందరూ కలిసి విందు ఆరగించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీల్లో మద్యం పట్టివేత

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 24: పట్టణ శివారులోని కేసీ క్యాంప్ కెనాల్ దగ్గర వాహన తనిఖీల్లో 8 లీటర్ల, 820 మిల్లీలీటర్లు మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ మంగళవారం రాత్రి తెలిపారు. ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామానికి చెందిన చదిరం ఐలయ్య అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం తరలిస్తుండగా, గుర్తించి పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు.